
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024





రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం 6:24 (సాయంత్రం)
సెహరీ : మంగళవారం 4:56 (ఉదయం)

నమో నారసింహా...



ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి రథోత్సవ దృశ్యం

- ఎగువ అహోబిలంలో ఘనంగా జ్వాలా నృసింహుడి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- నేడు దిగువ అహోబిలంలో తేరు

నంద్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహం... గోవిందనామస్మరణల నడుమ... జయజయధ్వానాల మధ్య నేత్రపర్వంగా ఎగువ అహోబిలం జ్వాలా నరసింహస్వామి రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. ముందుగా జ్వాలా నరసింహస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామివార్లను రథంపై అధిష్టించారు. రథయాజ్ఞీకులు, రథారూఢులైన శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామివారికి హారతులు ఇచ్చారు. అనంతరం భక్తుల జయజయధ్వనుల నడుమ రథాన్ని ముందుకు సాగించారు. భక్తులు భక్తి పారవశ్యంతో రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా దిగువ అహోబిలంలో ఆదివారం ప్రహ్లాదవరదస్వామికి కాళింగనర్తనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అభిషేకం, తొట్టితిరుమంజనం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. రాత్రి ప్రహ్లాదవరదస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు దిగువ అహోబిలంలో

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దిగువ అహోబిలంలో రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. అదేవిధంగా ఎగువ అహోబిలంలో ద్వాదశారాధనం పుష్పయాగోత్సవంతో పాటు రాత్రి గరుడోత్సవం, ధ్వజారోహణం వేడుకలను నిర్వహిస్తారు.



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడు



మంగళవాయిద్యాల నడుమ సాగుతున్న రథోత్సవం

ఓట్ల కోసం..!



కర్నూలు- ఆత్మకూరు రోడ్డులో పైపులైన్ పనులు

ఎన్నికల కోడ్ వస్తోందని ప్రభుత్వం హడావిడిగా అభివృద్ధి పనులు చేపట్టింది. నందికొట్కూరు పట్టణాన్ని నాలుగున్నరేళ్లు పట్టించుకున్న దాఖలా లేదు. సర్వేలో వైసీపీకి అననుకూల సంకేతాలు స్పష్టంగా కనిపించాయి. దీంతో ప్రభుత్వం ఎక్కడలేని ప్రేమ కురిపిస్తూ అభివృద్ధి పనులు చేపట్టింది. పట్టణ ఓటర్లను ఆకట్టుకునేందుకే రోడ్డు విస్తరణ, మంచి నీటి బోర్లు, పైపు లైన్ ఏర్పాటు, సీసీ రోడ్లు, శ్మశానవాటిక కాంపౌండ్, మున్సిపల్ కార్యాలయ నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపనలు చేశారు.

- హడావిడిగా అభివృద్ధి పనులు
- కోడ్ వచ్చాక కూడా అదే జోరు
- నందికొట్కూరు పట్టణంపై కురిపించిన అంతులేని ప్రేమ
- పరిహారం చెల్లించకుండానే పనులు

నందికొట్కూరు, మార్చి 24: నందికొట్కూరు పట్టణంలోని ఎన్నికల కోడ్ మధ్యనే రోడ్డ విస్తరణ పనులు జరుగుతున్నాయి. కేజీ రోడ్డు విస్తరణ పనులు రూ.2 కోట్లతో నాలుగు నెలల క్రితం ప్రారంభించారు. కుడి వైపు ఆర్‌డబ్ల్యూఎస్ తాగునీటి పైప్ లైన్ ఉండడంతో కేవలం ఎడమవైపు మాత్రమే రోడ్డు విస్తరణ పనులు రూ. 1 కోటితో పూర్తి చేశారు. ఈ పనులు పూర్తయి కూడా దాదాపు మూడు నెలలు అవుతోంది. అయితే ఇప్పుడు ఉన్నట్లుండి నాలుగైదు రోజుల నుంచి కేజీ రోడ్డుకు కుడి వైపున ఆర్‌డబ్ల్యూఎస్ పైపులైన్‌ను కొత్తగా వేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు మొదలు పెట్టారు. రూ. 25 లక్షలతో 800 మీటర్ల అడుగుల మేర కొత్తగా పైపులైన్‌ను వేస్తున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. అనంతరం మరో రూ.1 కోటితో కుడివైపు ఉన్న రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు గుత్తేదారు తెలిపారు.

ఫిబ్రవరి నెలాఖరు నుంచి చేపట్టిన పలు అభివృద్ధి పనులు

- ఫిబ్రవరి 22న రూ.232 కోట్లతో నూతన మున్సిపాలిటీ కార్యాలయం నిర్మాణానికి శిలాఫలకం
- ఫిబ్రవరి 28న ఏబీఎం పాలెంలో రూ.40 లక్షలతో పార్క్ పనులు ప్రారంభం
- మార్చి 4న పేదలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ
- మార్చి 10న కోట వీధిలో బోరు ఏర్పాటుకు భూమి పూజ
- మార్చి 13న ఎంపీ నిధులు రూ.25 లక్షలతో ముస్లిం మైనార్టీల శ్మశానవాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన
- పట్టణంలో దాదాపు ఆరు బోర్లు కొత్త వేశారు
- 800 మీటర్ల మేర పైపు లైన్, 1 కి.మీటరు మేర రోడ్డు విస్తరణ పనులు

పరిహారం మాటేమిటి?

రోడ్డు విస్తరణ పనులు చేయడాన్ని ఎవ్వరూ తప్పుబట్టడం లేదు. కాని రోడ్డు విస్తరణలో దుకాణాల స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇప్పించడంలో అధికారపార్టీ నాయకులు విఫలమయ్యారు. తమకు పరిహారం చెల్లించాలని యజమానులు గతంలో ఉన్న మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నో సార్లు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. విస్తరణ పనులను అడ్డుకునేందుకు వెళ్లిన యజమానులను మీ స్థలంలో జోక్యం చేసుకోవడం లేదని, ఆర్‌అండ్‌బీ స్థలంలోనే రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నామని చెప్పడం గమనార్హం.



ఆగని పైపులైన్ పనులు ?..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చాక కూడా తమకు పరిహారం చెల్లించకుండానే రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారని వ్యాపారులు అసిస్టెంట్ ఆర్వోకు, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అయినా కాంట్రాక్టర్ పనులను నిలిపివేయలేదు. ఈ పైపు లైన్ ఏర్పాటుకు టెండర్లు ఎప్పుడు ఇచ్చారు? ఎవరికి ఇచ్చారు? ఎవరు పనులు చేస్తున్నారనే విషయాలు తమకు తెలియవని మున్సిపల్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంటున్నారు. రోడ్డు విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేస్తున్నారు కాబట్టి వారే పైప్‌లైన్ కూడా వేయిస్తున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ఓ వైపు రోడ్డు వేసి మిగతా పనులను దాదాపు మూడు నెలలుగా పట్టించుకోని అధికారులు ఎన్నికల కోడ్ ఉండగా రోడ్డుకు మరో వైపు తాగునీటి పైపు లైన్ పనులు చేయడం చర్చనీయాంశంగా మారింది. పైపులైన్ లీకేజీలు ఉంటే మరమ్మత్తులు చేయాలన్నా, పాత పైపులైన్ శిథిలావస్థకు చేరితే కొత్త పైపు లైన్ వేయాలన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే టెండర్లు పిలవాలి. ఇవేవీ కాకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు ఏకంగా కొత్త పైప్‌లైన్‌ను రోడ్డు విస్తరణ పనులు చేసేందుకే చేపట్టారనే అనుమానం పట్టణ ప్రజల్లో కలుగుతోంది. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో కాంట్రాక్టర్ పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారపార్టీ గత ఎన్నికల ముందు కేజీ రోడ్డును విస్తరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని చెప్పుకునేందుకే కోడ్ సమయంలో కూడా హడావిడిగా పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ స్థలాలు కోల్పోయిన దుకాణదారులు, ప్రతిపక్షాలు అడ్డుకుంటే తమ తప్పేమీ లేదని చెప్పేందుకే ఈ పనులు చేపట్టారని తెలుస్తోంది.

మాకేమి సంబంధం లేదు

కేజీ రోడ్డు పక్కన వేస్తున్న పైపు లైన్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించినదే. రోడ్డు విస్తరణ పనుల వల్ల అక్కడున్న పైపులైన్ శిథిలం అవుతుంది. కాబట్టి ఆర్‌అండ్‌బీ శాఖే 800 మీటర్ల మేర పైపులైన్ వేస్తున్నది.
అమల, డీ.ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, నందికొట్కూరు

అప్రమత్తంగా ఉండండి

సిబ్బందికి ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశం



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, మార్చి 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా అమలయ్యేలా చూడాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్ అధికారులు, సిబ్బందితో ఎన్నికల నిబంధనలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిక్కచ్చిగా, నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ సాగేలా చూడాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఏ పార్టీ ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలన్నా ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రచార వాహనాలను ఉపయోగించుకునే క్రమంలో ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులెవరైనా ఉంటే గుర్తించి అలాంటి వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఆయా సబ్ డివిజన్, పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న చెక్‌పోస్టులపై నిరంతరం నిఘా ఉంచి నగదు, మద్యం అక్రమ రవాణా, గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణా జరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న క్రికెట్ ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

శ్రీశైలంలో ఘనంగా గిరి ప్రదక్షిణ



శ్రీశైల క్షేత్రంలో గిరి ప్రదక్షిణ దృశ్యం

శ్రీశైలం, మార్చి 24: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం పౌర్ణమి ఘడియల్లో గిరిప్రదక్షిణ వేడుక ఘనంగా జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంపై పల్లకీపై గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిప్రదక్షిణ ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమై గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, మల్లికార్జున సదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, అక్కడి నుంచి వలయదారి మీదుగా పుష్కరిణి వద్దకు చేరుకుంది. తిరిగి నందిమండప మీదుగా ఆలయ మహద్వారం చేరుకోవడంతో గిరి ప్రదక్షిణ ముగిసింది. శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమి ఘడియలను పురస్కరించుకుని సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని గంజాయిమయం చేసిన జగన్

బనగానపల్లె, మార్చి 24: రాష్ట్రాన్ని సీఎం జగన్ గంజాయిమయంగా మార్చేసి డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశాడని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని పలుకూరు గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ టీడీపీ హయంలో పెట్టుబడుల ఆకర్షణలో నంబర్ వన్‌గా ఉన్న ఏపీని సీఎం జగన్ గంజాయి, డ్రగ్ రవాణాలో నంబర్ 1 స్థానానికి చేర్చాడని విమర్శించారు. విశాఖపట్నంను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తామని చెప్పిన జగన్ డ్రగ్ క్యాపిటల్‌గా మార్చారని దుయ్యబట్టారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడ్డా దాని మూలాలు ఏపీలో బైటపడుతున్నాయని ధ్వజమెత్తారు. కల్తీ మద్యం మాఫియాతో ఇన్నాళ్లు ప్రజల ఇళ్లు, ఒళ్లు గుల్లయ్యాయని విమర్శించారు. జగన్ దోపిడీని యువత ప్రశ్నించకుండా ఉండడం కోసం మత్తులో దించి నిర్వీర్యం చేసి తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నాడని బీసీ ఆరోపించారు. జగన్‌కు సంబంధం లేకుండా ఇంత స్థాయిలో డ్రగ్స్ వ్యాపారం జరిగే అవకాశం లేదన్నారు. విశాఖను డ్రగ్స్ కేంద్రంగా మార్చే యత్నం చేస్తున్నారని విమర్శించారు. కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం, పోర్టులను తనవారికి కట్టబెట్టి తద్వారా అక్రమ వ్యాపారాలకు తెరవెను యత్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, చల్లామద్ది లేటి, గుండం మల్లికార్జునరెడ్డి, వల్లపుశంకర్, గగ్గెర అరుణకుమార్, చాకలి నాగమయ్య, గొల్ల రామచంద్రుడు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీసీ



పలుకూరులో బీసీని సత్కరిస్తున్న గ్రామస్థులు

కిక్కిరిసిన మంత్రాలయం

మంత్రాలయం, మార్చి 24: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆది, సోమవారం సెలవు దినాలు కావటంతో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలు, హోటల్‌లు, పూజా సామాగ్రికి డిమాండ్ పెరిగింది.



మంత్రాలయం మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

ప్లీజ్... అలక వీడండి..!

- అసంతృప్తికి లోనైన వారికి వైసీపీ బుజ్జగింపు
- అధిష్ఠానం భరోసా ఇస్తే ఆలోచిస్తా : వై. రుద్రగౌడు

ఎమ్మిగనూరు, మార్చి 24: ఎమ్మిగనూరు వైసీపీలో లుకలుకలపై వైసీపీ దృష్టి సారించింది. మొదటి నుంచి టికెట్ కేటాయింపుపై అసంతృప్తిగా ఉన్నవారిని చల్లబరిచేందుకు వైసీపీ దిగివస్తోంది. అసంతృప్తికి గురైనవారిని బుజ్జగించేందుకు వైసీపీ జిల్లా కో. ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి రంగంలోకి దిగారు. వైసీపీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి విఫలమైన వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ వై. రుద్రగౌడును ఆదివారం ఆయన స్వగృహంలో వైసీపీ జిల్లా కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్సీ మధుసుదన్‌లు కలిశారు. సీఎం జగన్ సభకు రావాలని వారు రుద్రగౌడును కోరారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన రుద్రగౌడుకు వైసీపీ మొండి చేయిచూపింది. చివరకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని బతిమిలాడినా ఆయన మొహం చాటేశారు. తనకు కాదని మాజీ ఎంపీ బుట్టారేణుకను తెరపైకి తీసుకువచ్చి టికెట్ ఇవ్వడంపై రుద్రగౌడు రగిలిపోతున్నారు.

సీఎం పర్యటన కోసమేనా..?

అయితే ఇన్నిరోజులూ గుర్తుకు రాని రుద్రగౌడు ఒక్కసారిగా వైసీపీ కీలక నేతలకు గుర్తుకొచ్చాడు. లింగాయత్ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతంలో ఆ సామాజిక వర్గానికి చెందిన రుద్రగౌడును బుజ్జగిస్తోంది వైసీపీ. ఈనెల 29న సీఎం జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మిగనూరులో జరిగే సిద్ధం సభకు వస్తుండడంతో పార్టీకి దూరంగా ఉన్న వారిని సభకు రప్పించేందుకు ఆ పార్టీ జిల్లా నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి రుద్రగౌడుతో సమావేశమయ్యారు. అలక వీడాలని జగన్ సభకు రావాలంటూ కోరినట్లు సమాచారం. అయితే రుద్రగౌడు మాత్రం 'పార్టీ అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో మా నాయకులకు, కార్యకర్తలకు ఏమీ చేసుకోలేకపోయాం. ఎన్నికల్లో కష్టపడి గెలిపిస్తే మమ్మల్ని మాట్లాడించకుండా మూలకు కూర్చోబెట్టారు. ఇప్పుడు కూడా నేను..మా అనుచరులు, నాయకులు, కార్యకర్తలు పనిచేస్తే రాబోయే రోజుల్లో ఇదే పరిస్థితి ఎదురుకాదని గ్యారెంటీ ఏంటి..' అని గట్టిగానే ప్రశ్నించినట్లు సమాచారం. అధిష్ఠానం నుంచి స్పష్టమైన భరోసా ఇస్తే ఆలోచిస్తామని చెప్పినట్లు తెలిసింది. దీంతో గౌడుతో సమావేశమైన నాయకులు ఒకట్రెండు రోజుల్లో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పి వచ్చినట్లు సమాచారం.



ఈనెల 29న ఎమ్మిగనూరుకు సీఎం జగన్ రాక

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న రాష్ట్ర సీఎం జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరుకు రానున్నారు. ఈ మేరకు ఆదివారం ఆపార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బుట్టా రేణుక, బీవై రామయ్య సభ నిర్వహించే వీవర్స్ కాలనీలోని మైదానాన్ని పరిశీలించారు.

కుంగిన రహదారికి తల్లి బలి

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- అమ్మప్రేమ దూరమైన చిన్నారులు



చిన్నారి చందనతో మృతురాలు పావని(ఫైల్)



యామిని



శివాని

రుద్రవరం, మార్చి 24: కుంగిన అర్‌అండ్‌బి రహదారికి ఓ తల్లి బలైంది. ముగ్గురు చిన్నారులకు అమ్మప్రేమను దూరం చేసింది. కుంగిన రోడ్డుపై జరిగిన ప్రమాదంలో మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన ఓ మహిళ మృతి చెందింది. రుద్రవరం గ్రామానికి చెందిన యాగంటి భార్య పావని (21) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందింది. ఈ నెల 22న మహానందిలో జరిగే బంధువుల వివాహానికి యాగంటి తన భార్యపావణితో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చిన్నకంబలూరు మెట్ట కాశిరెడ్డినాయన ఆశ్రమం సమీపంలో బైక్ అదుపుతప్పి ఒక్కసారిగా కిందకు పడిపోయింది. దీంతో వాహనంపై ఉన్న పావని కొద్ది దూరం ఎగిరిపడి తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ పావని చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఇదిలా ఉండగా ఘటన జరిగిన ప్రాంతంలో రోడ్డు కుంగడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతురాలి పావని తల్లి నాగేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాలన్న తెలిపారు. కాంట్రాక్టర్లు రహదారిని వేసేక్రమంలో సక్రమంగా రోలింగ్ చేయకపోవడంతోనే రహదారి కుంగినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు రహదారి ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

చిన్నారులకు అమ్మ ప్రేమ దూరం

యాంగటి, పావనిలకు మూడేళ్ల వయసు కలిగిన యామిని, శివాని బుడిబుడి నడకలతో అడుగులు వేస్తున్నారు. చందన అనే ఐదు నెలల చిన్నారి కూడా ఉంది. ఊహ తెలిసే లోపే ఈ ముగ్గురికీ అమ్మప్రేమ దూరమైంది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తరుణంలో రోడ్డు ప్రమాదం తల్లిని బలి తీసుకుంది. చిన్నారుల ఆలనా పాలనా ఎలా అని బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. రుద్రవరం గ్రామానికి చెందిన యాగంటికి శిరివెళ్లకు చెందిన పావనితో ఐదేళ్లక్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒకే కాన్పులో ఇద్దరు కవల ఆడపిల్లలు, రెండో కాన్పులో మరో ఆడపిల్ల జన్మించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో ఆ చిన్నారులకు తల్లిని దూరం అయింది.



చిన్నకంబలూరు మెట్ట సమీపంలో కృంగిన రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మట్టిసంచులు

పశుసంవర్ధక శాఖ జేడీగా శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 24: కర్నూలు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీగా పని చేస్తున్న రామచంద్రయ్య ఈ నెల 31న పదవి విరమణ చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆయన స్థానంలో జేడీగా తూర్పు గోదావరి జిల్లా మండపేట పశుసంవర్ధకశాఖ శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఇన్‌చార్జి ఎస్ఈ సురేంద్రబాబు సస్పెన్షన్ కొనసాగింపు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: నగర పాలక సంస్థలో ఇన్‌చార్జి ఎస్‌ఈగా విధుల నిర్వహిస్తూ ఏసీబీకి పట్టుబడిన సురేంద్రబాబును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. 2022 జూలై 1న రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే తన సస్పెన్షన్ ఎత్తివేయాలని సురేంద్రబాబు ఫిబ్రవరి 27న ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ మేరకు ఏసీబీ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు సస్పెన్షన్ కొనసాగించాలని ప్రభుత్వం ఆదివారం మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. తదపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు సస్పెన్షల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీకి ఆదేశాలు జారీ చేశారు.

ట్యాంకర్-కారు ఢీ : ఒకరి మృతి

మల్లన్న దర్శనానికి వెళ్తుండగా ఘటన

పాములపాడు, మార్చి 24: శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు సంతోషంగా బయల్దేరిన ఆ కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది. స్వామిదర్శనార్థం వెళ్తుండగా పాములపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీంద్ర రెడ్డి(36) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం కర్నూలుకు చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి శ్రీశైలం క్షేత్రానికి కారులో బయలుదేరారు. పాములపాడు రుద్రవరం గ్రామాల మధ్యలో కేజీ రోడ్డుపై కర్నూలు వైపు వెళ్తున్న డీజల్ ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో కారు నడుపుతున్న రవీంద్ర రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సింధూజ, కుమార్తెలు చైత్రిక, లోహిత, తల్లిదండ్రులు రామసింహారెడ్డి, రామకృష్ణమ్మ కూడా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే సంఘటనా స్థలానికి ఎస్ఐ అశోక్ తన సిబ్బందితో చేరుకొని గాయపడ్డవారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సల నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పాములపాడు గ్రామ శివార్లలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవిరెడ్డి

ప్రభుత్వ ఉద్యోగుల అధ్యక్షుడిగా నాగేంద్రప్ప

నంద్యాల టౌన్, మార్చి 24: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కె.నాగేంద్రప్ప ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాగేంద్రప్ప జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్ సూర్యనారాయణ జిల్లా కమిటీతో మాట్లాడి నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సలహాలు, సూచనలకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నాగేంద్రప్ప పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, తిరుపాలయ్య, సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షులు సత్యం, శ్రీహరి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కార్యకర్తలకు శిక్షణ అవసరం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు

కర్నూలు(కల్చరల్), మార్చి 24: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ)లోని అన్ని విభాగాల కార్యకర్తలకు శిక్షణ అవసరమని వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీ లోగల వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీహెచ్‌పీ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీహెచ్‌పీ బలోపేతానికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో సమితులను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ సంస్థాగతంగా నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు ఈ ఏడాది ఏప్రిల్ 27 నుంచీ మే 6 వరకు ఆదోనిలో జరుగుతాయని చెప్పారు.

నాటక రంగానికి శ్రీనివాసులు సేవలు చిరస్మరణీయం

విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య



ఎస్ శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కళాకారులు

కర్నూలు(కల్చరల్), మార్చి 24: జిల్లా నాటక రంగానికి ఎస్ శ్రీనివాసులు చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య కొనియాడారు. శనివారం కర్నూలులో కన్నుమూసిన విశ్రాంత జడ్పీ సీఈఓ, సీనియర్ రంగస్థల కళాకరుడు ఎస్ శ్రీనివాసులు సంస్మరణ సభ ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రంగస్థల నటులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి నివాళులు అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గత యాభై సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న గొప్ప నటుడు, హార్మోనిస్టు ఎస్ శ్రీనివాసులు మరణం తీరని లోటు అన్నారు. శ్రీనివాసులు కుమారుడు నారాయణస్వామి పేద కళాకారులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, సీనియర్ నటుడు హెచ్ చంద్రన్న, బి. దస్తగిరి, క్రిష్టఫర్, పెన్సనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగారెడ్డి, కళాకారులు గాండ్ల లక్ష్మన్న తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలరించిన 'అవ్వ అప్పచ్చి' సాంఘిక నాటకం...

నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెలా ప్రదర్శిస్తున్న సాంఘిక నాటకాల్లో భాగంగా ఆదివారం రాత్రి హైదరాబాదుకు చెందిన మురళి కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో పలువురు టీవీ కళాకారులు ప్రదర్శించిన 'అవ్వ అప్పచ్చి' సాంఘిక నాటకం ఆసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ నాటక ప్రదర్శనను విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరాయమ్య, ప్రముఖ వైద్యుడు డాక్టర్ మాల కొండయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీనియర్ రంగస్థల కళాకారులు మహ్మద్‌మియా, గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన ఆర్థిక క్రిమినల్ : కోట్ల

- టీడీపీ కార్యకర్తల జోలికివస్తే అథఃపాతాళానికి తొక్కుతాం...
- మంత్రి బుగ్గన సమీప బంధువు సహా 400 మంది వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరిక

బేతంచెర్ల, మార్చి 24: బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కాదని.. ఆర్థిక క్రిమినల్ అని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సమీప బంధువు బుగ్గన ప్రభాకర్ రెడ్డి తన అనుచరవర్గంతో టీడీపీలో చేరారు. పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ 70 సంవత్సరాల నుంచి రాజకీయాలలో ఉన్న తమ కుటుంబం ఫ్యాక్షన్ రాజకీయాలను ఏనాడూ ప్రోత్సహించలేదన్నారు. కోట్ల, కేఈ కుటుంబాల ఘర్షణల వల్ల 200 కుటుంబాల్లో స్త్రీలు తమ భర్తలను పోగొట్టుకున్నారని బుగ్గన చేస్తున్న చెత్త ఆరోపణలను ఎవరూ నమ్మకూడదన్నారు. ఒకవేళ అదే జరిగినట్లు ఆయన నిరూపిస్తే తామంతా రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని బుగ్గనకు సవాల్ విసిరారు. బుగ్గన టీడీపీ కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే పాతాళానికి తొక్కుతామని హెచ్చరించారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన పదవిని అడ్డం పెట్టుకుని ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న అతిపెద్ద నేరస్థుడని అన్నారు. వేసిన రోడ్ల మీదనే రోడ్లు వేసి కమిషన్లు రాబట్టిన కమిషన్ల రారాజు అన్నారు. రానున్న ఎన్నికల్లో కమిషన్ల రాజుకు చిత్తుచిత్తుగా ఓడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన వారిలో పోలూరు రాఘవరెడ్డి, జనసేన నాయకులు మద్దిలేటి స్వామి, మధు, నాగరాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, నాయకులు బుగ్గన మహేశ్వరరెడ్డి, బుగ్గన సుధాకర్ రెడ్డి, బజాజ్ షోరూం రామిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కానాల శివారెడ్డి, కైప మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, చంద్రారెడ్డి, కానాల సుబ్బారెడ్డి, అంకిరెడ్డి, తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

స్వామి కథల్లో సీమ జీవన సారం

ప్రజాకవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

కర్నూలు(కల్చరల్), మార్చి 24: కరువు కాటకాల రాయలసీమ జీవన సారమంతా బండి నారాయణ స్వామి రాసిన కథల్లో ఉంటుందని ప్రముఖ ప్రజాకవి, గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాకు చెందిన బండి నారాయణ స్వామి 'మన సీమ కథలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గోరటి వెంకన్న ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమలో వేమన కాలం నుంచి సామాజిక స్పృహతో రాసిన కవులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. రాయలసీమలో తాండవిస్తున్న కరువు, వెనుకబాటుతనంపై ఉద్యమ స్ఫూర్తితో కథలు రాస్తున్న వారిలో బండి నారాయణ స్వామి ముందున్నారని ప్రశంసించారు. రాయలసీమ ఉద్యమంలో సీమ రచయితలు ముందున్నారని, సీమ ఉద్యమం ఇంకా బలోపేతం కావాలని అన్నారు. సీమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా అన్ని వర్గాలు కృషి చేయాలని కోరారు. పుస్తకావిష్కర్త, సీమ ఉద్యమకారుడు కానాపురం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీమలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం లభించాలంటే మళ్లీ రాయలసీమ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సీమ సాగునీటి ప్రణాళికా నిపుణుడు పాణ్యం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీమ చుట్టూ నదులు ఉన్నా, ఈ ప్రాంతం ఎడారిగా మారడానికి, నీటి ఎద్దడికి కారణం పాలకులేనని అన్నారు సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ ఎం. హరికిషన్ మాట్లాడుతూ సీమ అస్థిత్వంపై ఎందరో రచనలు చేసినా, బండి నారాయణస్వామి వంటి కథకులు అనేక ప్రాంతీయ సమస్యలను ముందుకు తెచ్చారని అన్నారు. కథా రచయిత బండి నారాయణస్వామి మాట్లాడుతూ సీమలో జరుగుతున్న ప్రజాస్వామిక ఉద్యమాలను కొన్ని పత్రికలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాల నుంచి రచయితలు నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ స్వామి తొలి దశ కథలకు, ప్రత్యేక రాయలసీమ ఉద్యమ నేపథ్యంలో రాసిన కథలకు వస్తు శిల్పాల్లో స్పష్టమైన తేడా ఉందని అన్నారు. మారుతి పౌరోహితం మాట్లాడుతూ రాయలసీమ రాజకీయార్థిక విషయాలు స్వామి కథల్లో ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో రాయలసీమ సాగునీటి ప్రణాళికా నిపుణుడు పాణ్యం సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి. నాగార్జున రెడ్డి, సీమకృష్ణ, రవి కుమార్, ఫుల్లా రామాంజినేయులు, డాక్టర్ కె. చంద్రమౌళిని, కల్లం ప్రహ్లాద తదితరులు ప్రసంగించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న, కృష్ణారెడ్డి

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రోత్సాహం

- హెక్టారుకు రూ.21 వేల రాయితీ
- ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 24: ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు లాభదాయకం అని కర్నూలు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ పంట సాగు కోసం ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని ఇందులో భాగంగా సి. బెళగల్ మండలం కొత్తకోట గ్రామంలో రైతులు ఆయిల్‌ఫామ్ సాగుకు ముందుకు రాగా, వారికి ఉద్యానశాఖతో పాటు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సహకారంతో ఆర్థిక సహకారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట సాగుకు 13 మండలాల్లో 14 గ్రామాలు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించామని గోనెగండ్ల, బెళగల్, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, కర్నూలు, ఆదోని, హొళగుంద, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కర్నూలు, హాలహర్వి, క్రిష్ణగిరి మండలాల్లో ఈ పంట సాగుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు కొన్ని కంపెనీలకు దత్తత ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పతంజలి ఫుడ్ లిమిటెడ్ సంస్థకు సీ. బెళగల్, గోనెగండ్ల మండలాలు, నవభారత్ లిమిటెడ్ సంస్థకు క్రిష్ణగిరి, ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు మండలాలు, లివింగ్ ఫుడ్స్ సంస్థకు మంత్రాలయం, హొళగుంద, హాలహర్వి, కౌతాళం, కోసిగి, నందవరం, పెద్దకడుబూరు మండలాలను కేటాయించినట్లు ఏడీ రామాంజనేయులు తెలిపారు. ప్రస్తుతం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సీ. బెళగల్ మండలంలో ఆయిల్‌ఫామ్ సాగుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రభుత్వం హెక్టారుకు రూ.21 వేల రాయితీని ఇస్తోందని తెలిపారు. ఏడాదికి రూ.5250 ప్రకారం నాలుగేళ్లు నేషనల్ మిషన్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ అండ్ ఆయిల్ ఫామ్ కేంద్ర సంస్థలు ఈ రాయితీని అందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

కూలిన రథశాల ఇనుప షెట్టర్

మహానందిలో భక్తులకు తప్పిన ప్రమాదం

మహానంది, మార్చి 24: మహానంది క్షేత్రంలో రథశాలకు ఉండే ఇనుప షెట్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో భక్తులకు పెను ప్రమాదం తప్పింది. మహాశివరాత్రి పర్వదినం తర్వాత క్షేత్రంలో 16 రోజుల పండుగను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక రథానికి పూజలు చేసి రథశాలలోకి దాన్ని పంపారు. ఇంత వరకు కార్యక్రమం సజావుగా సాగింది. అయితే రథాన్ని లోపలికి పంపించాక సిబ్బంది ఇనుప షెట్టర్‌ను మూసివేస్తున్న సమయంలో షెట్టర్‌లోని కొంత భాగం ఊడి పడింది. ఆ సమయంలో భక్తులు అక్కడ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. రథశాలకు ఏర్పాటు చేసిన షెట్టర్ తుప్పు పట్టడం వల్ల విరిగి పడిందని ఆలయ అధికారులు తెలిపారు. త్వరలోనే షెట్టర్‌కు మరమ్మతు చేస్తామని ఆలయ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు.



రథశాలలో కూలిన షట్టర్

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరు మృతి

నంద్యాల హైవేలో ఘటన





ప్రమాదంలో మృతి చెందిన రాజేశ్, ప్రసాద్‌రెడ్డి

నంద్యాల (రూరల్), మార్చి 24: నంద్యాల పట్టణ శివారులో ఆదివారం జరిగిన బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు చనిపోగా, మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి (45) నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నివసిస్తూ నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు బాలనాగయ్యతో కలిసి బైక్‌పై మసీదుపురానికి బయలుదేరాడు. ఇదే సమయంలో నంద్యాల గుడిపాటిగడ్డలో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్న ఉప్పు రాజేశ్ (25) తన స్నేహితుడి వెంకటసాయి సుధీర్‌తో కలిసి బైక్‌పై ఆళ్లగడ్డలోని ఓ పెళ్లికి హాజరయ్యాడు. తిరిగి ప్రయాణంలో నంద్యాల శివారు అయ్యలూరి మెట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ప్రసాద్‌రెడ్డి బైక్‌ను రాజేశ్ నడుపుతున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ప్రసాద్‌రెడ్డి, రాజేశ్, సుధీర్‌ను స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రసాద్‌రెడ్డి, రాజేశ్‌లు మృతి చెందగా, సుధీర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి’



సాంబవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

గోస్పాడు, మార్చి 24: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సూచించారు. ఆదివారం బీఎస్‌ఎఫ్ సిబ్బందితో కలిసి దీబగుంట్ల, సాంబవరం, కానాలపల్లె గ్రామాలలో ఫూట్ పెట్రోలింగ్, స్లాగ్‌మార్చ్ చేశారు. ఇందులో భాగంగా ఆ ఏరియాలో ఉన్న ప్రజలతో మాట్లాడారు. గ్రామాలలో ఉన్న వివాదాస్పద వ్యక్తులను పిలిచి గ్రామాల్లో అల్లర్లు సృష్టించకుండా ఉండాలని హెచ్చరించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జూపాడుబంగ్లా, మార్చి 24: ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి పదో తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 28 నుంచి మే 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీసీ మృతి

పాములపాడు, మార్చి 24: పాములపాడు వెలుగు కార్యాలయంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న మనోహరరాజ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత రెండురోజుల క్రితం శ్వాసపీల్చుకోవడం ఇబ్బందిగా ఉండటంతో కర్నూలులోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి వైద్యశాలకు వెళ్లి మృతుడికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రైలు నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

మహానంది, మార్చి 24: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి వ్యక్తికి తీవ్రగాయాలపాలైన సంఘటన ఆదివారం మహానంది మండలం చలమ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తి రైలులో ప్రయాణిస్తున్న సమయంలో గాజులపల్లి ఆర్‌ఎస్- చలమ రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. రైల్వే అధికారులు అప్రమత్తమై గాయపడ్డ అశోక్‌ను చికిత్సకై 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు పాత్రికేయులకు అవగాహన సదస్సు

నంద్యాల (కల్చరల్), మార్చి 24: నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఉదయం గంటల11.30 గంటలకు మీడియా వారికి అవగాహన సదస్సు, వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు డీపీఆర్వో అధికారులు తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజకీయ ప్రచార ప్రకటనలు, పెయిడ్ న్యూస్, కేబుల్ చానెళ్లలో రాజకీయ ప్రకటనలు, సోషల్ మీడియా నిబంధనలు తదితర అంశాలపై అవగాహన సదస్సు, వర్క్‌షాప్ ఉంటుందని చెప్పారు. ఎన్నికల సూచనలను అందిస్తామన్నారు. సదరు కార్యక్రమానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరూ, డెస్క్ ఇన్‌చార్జిలు, యాడ్స్ ఇన్‌చార్జిలు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు అందరూ తప్పక హాజరై వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నందికొట్కూరు, మార్చి 24: మిడ్తూరు మండలం చెరుకుచర్ల గ్రామంలో ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు మిడ్తూరు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. వీరిలో వైసీపీ నాయకులు, ఒక వలంటీర్ ఉన్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ



ఆత్మకూరులో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, మార్చి 24: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలను చేపట్టినట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో బీఎస్‌ఎఫ్ జవాన్లతో వాహనాల తనిఖీలు చేశారు. సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్రమ మద్యం, ఎలాంటి ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు రవాణా జరగకుండా తనిఖీలు చేపట్టామని అన్నారు. ప్రయాణికులు తమ వాహనాలలో అధిక మొత్తంలో నగదు తీసుకునివెళ్లవలసి వస్తే వాటికి సరైన ఆధారాలను, రశీదులను కల్గి ఉండాలని సూచించారు. లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తారని చెప్పారు. ఇదిలావుంటే బైర్లూటి వద్ద అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

‘కలసికట్టుగా పనిచేయాలి’

బండిఆత్మకూరు, మార్చి 24: శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గెలుపునకు జన సైనికులంతా కలసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు అభిమన్యుడు, మండల అధ్యక్షుడు సురేష్, సీనియర్ నాయకుడు శేషకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం బండిఆత్మకూరులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలని, నిర్లక్ష్యం వద్దని సూచించారు. సమావేశంలో మల్లేష్ యాదవ్, దస్తగిరి, కుమార్, రాజశేఖర్, సంజీవకుమార్, శేఖర్, మహేంద్ర, వెంకసుబ్బయ్య పాల్గొన్నారు.

‘మీటర్ రీడర్లను ఉద్యోగులుగా గుర్తించాలి’



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలకాశి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: విద్యుత్ మీటర్ రీడర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలకాశి అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్కో అకౌంట్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. మూడు డిస్కంలలో కుదించిన పనిదినాలను పెంచాలని డిమాండ్ చేశారు. పీస్ రేట్లు పెంచడంతో పాటు రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి మునెప్ప, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి, ప్రధాన కార్యదర్శి సుంకయ్య, యూనియన్ రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముసుగు వేశారు

● ‘నిబంధనలకు కలరింగ్’ కథనంపై కదలిన అధికారులు



పద్మావతినగర్ ఆర్చీ వద్ద శిలాఫలకానికి ముసుగు



నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి కింద జలశుద్ధి పంపిణీ కేంద్రం బోర్డుకు ముసుగు వేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల టౌన్, మార్చి 24: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల కోడ్ అమలు వ్యవహారం అబాసుపాలవుతోందని ‘నిబంధనలకు కలరింగ్’ అన్న శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం అధికారులలో కలకలం రేపింది. అధికార వైసీపీకి వత్తాసు పలుకుతూ అధికార పార్టీ నాయకులు ఇటీవల హడావుడిగా చేసిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలా ఫలకాలకు ఉన్న అధికార పార్టీ రంగులు, అధికార పార్టీ నాయకుల పేర్లు ఉన్న శిలా ఫలకాలను ముసుగు వేయకుండా తూతూ మంత్రంగా అధికారులు చేపట్టిన చర్యలపై ఫొటోలతో ప్రచురితమైన కథనం జిల్లా ఉన్నతాధికారులు కిందిస్థాయి పర్యవేక్షణా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ఎన్నికల నిబంధనలు అమలు చేయాల్సిన సిబ్బంది అధికార పార్టీకి వంతపాడుతూ తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో నిబంధనలకు కలరింగ్ కథనం ప్రాధాన్యతను సంతరించుకుంది. తూతూమంత్రంగా వేసిన ముసుగు స్థానంలో పూర్తిస్థాయిలో ముసుగు వేశారు. 21వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి అమృతరాజ్ ఇంటిపై మానమ్మకం నువ్వే జగన్ బోర్డుకు పూర్తిగా ముసుగు వేశారు. 35వ వార్డు సచివాలయం ప్రహరీ గోడకు ఉన్న వైసీపీ రంగులు అగుపించకుండా పాత ఫ్లెక్సీలను అతికించారు. అయితే భవనం పైభాగంలో ఉన్న వైసీపీ రంగులపై ఎలాంటివి అతికించలేదు. శ్యామ్‌నగర్ బ్రిడ్జి వద్ద శిలా ఫలకాన్ని పాత సంచి పట్టలతో కప్పి వేసినప్పటికీ వాటికి ఎలాంటి తాళ్లు బిగించలేదు. దీంతో ఈదురు గాలులకు అవి లేచిపోవడం గ్యారెంటేనని స్థానికులు పేర్కొన్నారు. ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న జలశుద్ధి పంపిణీ కేంద్రానికి ఉన్న బోర్డుకు పూర్తిగా మూసివేశారు. ఇంకా పలుచోట్ల అధికార పార్టీ రంగు రంగుల శిలా ఫలకా లకు, ఫ్లెక్సీ హోర్డింగ్‌లను పూర్తి స్థాయిలో అగుపించకుండా అధికారులు ముసుగు వేస్తారా.. లేదా అన్న విషయంపై చర్యల కోసం వేచి చూడాల్సిందే.

ఘనంగా ‘మట్టల ఆదివారం’



తంగడంచ గ్రామంలో మట్టలతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జూపాడుబంగ్లా, మార్చి 24: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం మట్టల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా చర్చిలో ఈత మట్టలతో ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామం శాంతియుతంగా మెలగాలని భక్తులు మట్టలను పట్టుకుని భక్తి కీర్తనలతో గ్రామంలో ఊరేగించారు. తంగడంచ, జూపాడుబంగ్లా, మండ్లెం, పారుమంచాల, తూడిచర్ల, బన్నూరు తదితర గ్రామాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు మట్టల పండుగ ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, లింగాపురం, శివపురం, సింగరాజుపల్లి, ముసలిమడుగు, నందికుంట, గువ్వలకుంట్ల, ఎర్రమటం తదితర గ్రామాల్లో ఉదయం నుంచి పిల్లలను మొదలుకుని వృద్ధుల వరకు మట్టలు తీసుకుని వీదుల వెంట ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కొత్తపల్లి ఫాస్టర్ సంఘ కాపరి భరత్ బాబు క్రైస్తవులనుద్దేశించి మట్టల పండుగ విశిష్టతను వివరించారు. దాదాపు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాసదీక్షలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఇతరుల పట్ల ప్రేమపూర్వకంగా మెలగాలని భరత్ బాబు వివరించారు.



గడివేముల: ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిలను ప్రత్యేక అలంకరణలో చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వ్యాఖ్యోపదేశకులు యేసు క్రీస్తు పునరుత్థానం గురించి బోధనలు వినిపించారు. అనంతరం క్రైస్తవులు మట్టలతో గ్రామ పురవీదుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు పట్టణం, గ్రామాల్లోని ఆయా చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిలలో ఫాస్టర్ల ఆధ్వర్యంలో చర్చిల ప్రాంగణంలో ఏసు నామము స్మరిస్తూ మట్టలను చేత బూని చిన్నారులు, సంఘస్థులు, క్రైస్తవులు చర్చిల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేకించి పట్టణంలోని ఇందిరానగర్, ఎస్సీజీపాలెం, ఏబీఎం పాలెం, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లోని చర్చీల్లో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతి, ప్రేమ విధానాలు కలిగిన సుఖమయమైన జీవితానికి ఏసు బోధనలను అనుసరించాలని వక్తలు బోధించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో గ్రామశివార్లలోని పొలాల్లోకి వెళ్లి అక్కడి నుంచే మట్టలు చేతబూని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా వచ్చారు. అలాగే ఏసుప్రభుకు సంబంధించి పాటలు ఆలపిస్తూ.. ఆయన మహిమను తెలియజేశారు. అనంతరం ఆయా చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కొత్తపల్లి: గువ్వలకుంట్లలో..



ఎస్సీజీ పాలెంలో..

‘క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి’



ఆత్మకూరులో ర్యాలీ

ఆత్మకూరు, మార్చి 24: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక వైద్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాయుడు, టీబీ యూనిట్ వైద్యాధికారి పవన్ కుమార్ కోరారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం పురస్కరించుకుని స్థానిక ఆసుపత్రి నందు క్షయవ్యాధిని గుర్తించిన శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్ కాక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు రవికుమార్, మస్తానయ్య, సంపూర్ణ సురక్షా కేంద్రం మేనేజర్ జబివుల్లా, స్టాఫ్ నర్స్‌లు రాఘవ, రెహానా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వెలుగోడు: ప్రపంచ క్షయవ్యాధి నివారణ పురస్కరించుకొని ఆదివారం ట్రైబల్ హస్పిటల్ వైద్యాధికారి, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు నాజీమ్ అహమ్మద్, సుధా ప్రణతిలు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, దగ్గినప్పుడు గళ్ల పడటం, రక్తం పడటం, ఆకలి లేక పోవడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనబడితే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించు కోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రాజు, మధుసూదన్, ఫణీంద్ర, భావన, బాలచంద్రుడు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అకట్టుకున్న నిత్య కళారాధన



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మార్చి 24: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఎస్ ఫైన్ ఆర్ట్స్ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకకౌత్వం, జతిస్వరం, తాండవ నృత్యకరి, భో..శంభో, శివశివ శంకర, ఓం నమః శివాయ తదితర గీతాలకు నందిని, సంయుక్త, సింధుశ్రీ, సుదీక్ష, అక్షయ్య, గ్రీష్మిత, దీక్షిత, మనస్విని, స్వర్ణకీర్తి, నిత్య, గీతిక తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

హెల్త్ కార్డుల పంపిణీ



హెల్త్ కార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

నంద్యాల (రూరల్/నూనెపల్లె), మార్చి 24: నంద్యాల ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఏపీ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాయలసీమ రీజియన్ అధ్వర్యంలో హెల్త్ కార్డుల పంపిణీ చేశారు. స్థానిక సెవెన్ హిల్స్ ఆసుపత్రి ఆవరణలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని 20 పాఠశాలలకు చెందిన 300 మంది టీచర్లకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఏపీ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాయలసీమ రీజియన్ అధ్యక్షుడు రొటేరియన్ దండె దస్తగిరి మాట్లాడుతూ సెవెన్ హిల్స్ ఆసుపత్రి ఎండీ మారుతి సహకారంతో ఈ బృహత్కార్యాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది క్యాంపస్, సన్‌రైజ్ పాఠశాలల కరస్పాండెంట్లు ఖలీల్, బూదాల భాస్కర్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలి



సంజీవ్ నగర్‌తండా గ్రామంలో హోలి సంబరాలు



వెలుగోడులో..

ఆత్మకూరు రూరల్, మార్చి 24: ఆత్మకూరు మండలంలోని సంజీవ్‌నగర్ తండా, ముష్ట పల్లి, నల్లకాలువ తదితర గ్రామాల్లో హోలి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు, పెద్దలు ఒకరిపై రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ముఖ్యంగా మహిళలు సైతం ఈ సంబరాల్లో పాల్గొని రంగు నీళ్లను ఒకరిపై చల్లుకుంటూ ఆనందంగా సంబరాలు జరుపుకున్నారు. సంజీవ్‌నగర్ తాండాలోని గ్రామస్థులు సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. సుగాలి మహిళలు సాంప్రదాయ వేషధారణతో పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు.

ఆత్మకూరు: హోలిసంబరాల్లో భాగంగా కామదహన కార్యక్రమాన్ని ఆదివారం అర్ధరాత్రి ఆత్మకూరు పట్టణంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు వరిగడ్డితో మన్మథ రూపంలో తయారు చేసిన కామదేవున్ని ఊరేగింపు నిర్వహించి దహనం చేశారు. పరమశివుడి తపస్సును మన్మథుడు తపోభంగం చేయడం వల్ల పాల్గుణ చతుర్దశి నాడు శివుడు మన్మథుడి దహనం చేస్తారన్నది ప్రతీతి. దీని ప్రకారమే ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని ఆనవాయితీగా చేపడుతున్నారు. పట్టణంలోని తోటగేరి, గాంధీపార్క్, వడ్లపేట, లింగాయితీవీధి, కిషన్‌సింగ్ వీధుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంతో సంబరంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో యువత విశేషంగా పాల్గొన్నారు.

వెలుగోడు: జమ్మినగర్ తండాలో హోలి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం నృత్యాలు చేస్తూ, పూజలు చేసి కాముని దహనం కార్యక్రమం చేపట్టారు. అలాగే యువత రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఫరూక్



టీడీపీలో చేరిన నాయకులతో ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 24: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని, ఆయనపై నమ్మకంతోనే వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారని టీడీపీ నంద్యాల అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం 8వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఉప్పరి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శిల్పా కుటుంబానికి ముఖ్య అనుచరులైన షబ్బీర్, ఆలీతో పాటు 70 మంది వైసీపీని వీడి ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయంలో వారికి ఫరూక్, ఫిరోజ్ టీడీపీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఫరూక్ మాట్లాడుతూ శిల్పా పాలన నచ్చక వైసీపీ నాయకులు, ముఖ్య అనుచరులు దూరమైపోతున్నారన్నారు.

‘ఏపీని డ్రగ్స్ రాష్ట్రంగా మార్చిన జగన్’



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, మార్చి 24: సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రాష్ట్రంగా మార్చారని టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్ మాఫియా పెద్ద ఎత్తున భయటపడడంతో యువత తల్లిదండ్రులు తీవ్రభయాందోళన చెందుతున్నారన్నారు. వైసీపీ పాలనలో యువత భవిష్యత్తు సర్వనాశనం చేశారని మండిపడ్డారు.

● తాటిపాడు, తంగడంచ గ్రామ వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీలో చేరారు. అల్లూరు గ్రామంలోని టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి నివాసంలో సమక్షంలో తాటిపాడు వీరారెడ్డి, ప్రభాకరెడ్డి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు టీడీపీ చేరాయి. అలాగే తంగడంచ గ్రామ వైసీపీ నాయకులు కూడా మధు, గోకారమయ్యలతో పాటుగా మరికొంత మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ అభ్యర్థి జయసూర్య, మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: ఘణపురంలో ఆదివారం రాత్రి శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం వైసీపీ కి చెందిన ఘనపురం ఎంపీటీసీ ప్రియాంకతో పాటు ప్రాతకోట గ్రామాలకు చెందిన వంద మందికి పైగా గ్రామస్థులు టీడీపీలోకి చేరారు. టీడీపీ మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, చంద్రేష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగశేషులు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత రైతును పరామర్శిస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల రూరల్, మార్చి 24: మండలంలోని పెద్ద కొట్టాల గ్రామంలో చాకలి నరసంహుడుకు చెందిన 15 గొర్రెలు మృతి చెందాయి. దీంతో నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పెద్ద కొట్టాల గ్రామం వెళ్లి బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఘటనా స్థలాని పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక అనంతరం గొ ర్రెల మృతికి కారణాలు వెల్లడవుతాయని చెప్పారు.

‘వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి’

నందికొట్కూరు, మార్చి 24: అవినీతి, డ్రగ్ మాఫియాకు అడ్డాగా ఏపీని మార్చుతున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని, వైసీపీని ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయని, అరాచకపాలనకు అంతం పలకాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నందికొట్కూరు అసెంబ్లీ బీజేపీ సమావేశం సత్యనారాయణ కళ్యాణ మండపం సుబ్బారావుపేటలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీఎస్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు మల్లెల కృష్ణారెడ్డి హాజరయ్యారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి, డ్రగ్ మాఫియాకు అడ్డాగా ఏపీని మార్చుతున్న అవినీతి, అక్రమాల వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే యువతరాన్ని కొకైన్ మత్తులో ముంచుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి తన పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి పాలన నుంచి విముక్తి కలగాలంటే టీడీపీ, బీజేపీ, జనసేనల కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత, ఆవశ్యకత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు

మహానంది, మార్చి 24: మహానందికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు బీకే స్వామిరెడ్డి ఆదివారం రాత్రి టీడీపీలో చేరారు. మహానంది టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో చేరారు. మహానంది టీడీపీ ఇన్‌చార్జి గని చిన్న రంగస్వామి, సూరే శ్రీనివాసులు, ఉమాదేవి, బీకే సరోజమ్మ, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో పురాణ పండితుడి పూజలు



లక్ష్మీ సీతారామాంజనేయశర్మ సన్మానిస్తున్న ఆలయ వేద పండితులు

మహానంది, మార్చి 24: మహానంది క్షేత్రంలో ప్రముఖ సంస్కృత, పురాతన పండితుడు లక్ష్మీ సీతా రామాంజనేయ శర్మ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయంలో వేదపండితులతో పాటు అర్చకులు రాజరత్తయ్యబాబు స్వామి స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ చరిత్ర గురించి ఆయనకు వివరించారు. గతంలో శ్రీశైలం క్షేత్రం గురించి శ్రీశైల ఖండం గ్రంథం రచించినట్లు పండితులు లక్ష్మీ సీతారామాంజనేయశర్మ తెలిపారు. అలాగే కాణిపాకం వరసిద్ధి వినాయకుని దేవాలయం సంపూర్ణ చరిత్ర పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా లోని భీమవరం ప్రభుత్వ కళాశాలలో సంస్కృత అధ్యాపకులుగా తాను విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వీరిని ఆలయ వేద పండితులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం



గాయపడ్డ జనసేన కార్యకర్తను పరామర్శిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 24: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన కార్యకర్తలను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మలు భరోసానిచ్చారు. బనగానపల్లెకు చెందిన మదార్‌సా బిల్డింగ్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డ కార్యకర్త షేక్ మదార్‌ను ఆదివారం వారు పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం వారికి ఆర్థిక సహాయం అందజేశారు. షేక్ మదార్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసానిచ్చారు.

జనసేన కార్యకర్తకు భరోసా

పట్టణంలోని ఈద్గానగర్‌కు చెందిన జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు రామగురువాచారి మోటార్‌సైకిల్‌పై కింద పడి గాయాలయ్యాయి. టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ఆదివారం పరామర్శించారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం బీసీ ఇందిరమ్మ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయలసీమ సలాం, జనసేనపార్టీ నాయకులు భాస్కర్ గబ్బర్‌సింగ్, జనసేన పార్టీనాయకులు ఖాశీం, షేక్షావలి, ప్రసాద్, హాజీవలి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు

డోన్(రూరల్), మార్చి 24: మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో నెలకొన్న కాశిరెడ్డినాయన ఆశ్రమంలో సోమవారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు భక్తబృందం తెలిపింది. ఉత్సవాల సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. భక్తులు ఈ ఆరాధనోత్సవాల్లో పాల్గొని కోరారు.

ఘనంగా హోలీ సంబరాలు



రంగులు చల్లుకుంటున్న జరుపుకుంటున్న యువత

బేతంచెర్ల, మార్చి 24: మండలంలోని గోరుమానుకొండ తండా, బుగ్గానిపల్లె తండా, గిరిజన తండాలలో హోలీ సంబరాలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. అందులో చిన్నారులు, పెద్దలు, యువకులు పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. వేడుకల్లో రవీంద్ర నాయక్, బాలస్వామి నాయక్, ఎం.గౌతమ్ నాయక్, కిరణ్ నాయక్, లోకేశ్ నాయక్, లవ నాయక్, సురేష్ నాయక్, విజయ నాయక్, వెంకటేశ్, ఇంద్ర, వెంకటేశ్వర్లు, తపురా నాయక్‌లు పాల్గొన్నారు.

చాగలమర్రి, మార్చి 24: మండలంలోని ఎం.తండా గ్రామంలో ఆదివారం హోలి వేడుకలను సుగాలీలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని రంగోళి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల నృత్యాల అలరించాయి. చిన్నారులు జాజిరి ఆటలు ఆటలతో నృత్యాలు చేశారు.

మూడురాళ్లపల్లెలో ర్యాలీ



చాగలమర్రిలో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చాగలమర్రి, మార్చి 24: చాగలమర్రి గ్రామంలోని వాసవీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో స్పెషల్ క్యాంపు నిర్వహణ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో వారం రోజుల పాటు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య తెలిపారు. దేవాలయాల్లో శుభ్రత, రహదారుల మరమ్మతులు, ముళ్ల కంపల తొలగింపు, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి స్పెషల్ క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షాబుద్దీన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బనగానపల్లె, మార్చి 24: బనగానపల్లె మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నందివర్గం ఎస్ఐ తిరుపాలు ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. పలు కార్లు, మోటారుబైక్‌లు, లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ప్యాపిలి: మండలంలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టు దగ్గర రోజు వాహనాల తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి నగదు, మారణాయుధాలు ఇతర వస్తువులు తరలించిన స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

ప్యాపిలి, మార్చి 24: ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ జగదీశ్వరరెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఆయన రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నిలు వస్తున్నందున గ్రామాలపై నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

డోన్(రూరల్), మార్చి 24: పట్టణంలో ప్రముఖ హీరో మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బలిజ భవనంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం, కర్నూలు చిరంజీవి యువత ఈసీ మెంబర్ మధు సాగర్, పుల్లయ్య, ఆర్య, వీకే ప్రసాద్, ప్యాపిలి చంద్ర, మధునాయుడు, కొత్తకోట రామచంద్రుడు, సునీల్, జనసేన కార్యకర్తలు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

మాట తప్పిన జగన్

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 24: గత ఎన్నికల ముందు మద్య నిషేధం చేస్తామని వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చి మహిళలకు మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ వైసీపీ నాయకుల కనుసన్నల్లో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకున్నా 99 శాతం నెరవేర్చామని వైసీపీ బూటకపు ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి కాంట్రాక్టర్లకే తప్ప. ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. డోన్‌లో టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా ఇద్దామని కోట్ల సుజాతమ్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఫణిరాజు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్లు టీఈ కేశన్నగౌడు, దశరథరామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ భారతి, భాస్కర్ నాయుడు, సుధీష్, ఓంప్రకాష్, ఎల్లగౌడు, బైసాని రాజు, భూమా నాగన్న, సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, ఆర్ఈ నరసింహ, చనుగొండ్ల శ్రీరాములు హేమసుందర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు వడ్డె మహారాజు, రామయ్య, రాఘవేంద్ర అచారి పాల్గొన్నారు.

కూటమిని గెలిపిద్దాం

డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని అందరం కలిసికట్టుగా పని చేసి గెలిపించుకుందామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డె మహారాజ్, హేమసుందర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓబులాపురం శేషిరెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను బీజేపీ నాయకులు కలిసి ఎన్నికల ప్రచారంపై చర్చించారు. మహారాజ్ మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్రంలో రోడ్లు, ఆసుపత్రులు, బడులు, మెడికల్ కళాశాలలు, కోర్టుల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను ఇచ్చినా వైసీపీ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీని ఓడించేందుకు టీడీపీ, జనసేన కూటమితో బీజేపీ జత కలిసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోట్ల సుజాతమ్మ



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

చేరికలతో టీడీపీలో జోష్

భారీగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నాయకులు ● అన్ని వర్గాలను అదుకుంటామని బీసీ హామీ

బనగానపల్లె, మార్చి 24: బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా వైసీపీ నాయకులు చేరుతున్నారు. దీంతో టీడీపీలో జోష్ వచ్చిందని నాయకులు అంటున్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఏరియాకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆహ్వానించారు. బనగానపల్లె పట్టణంలోని 1వ వార్డు సభ్యుడు సంగు శ్రీనివాసరెడ్డి, హుసేన్‌వలి ,మాధవరెడ్డి, అక్బర్ వలి, మాదదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షాషావలి, మదార్ వలి, శివారెడ్డి, చనుగొండ్ల వెంకటరాముడు, వడ్డెపుల్లయ్య, పీరాహుసేన్, మురళి, ఫణీందర్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి, నబీరసూల్, చాంద్, హాజీ, కరీం తదితర 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బీసీ మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో కొత్తగా టీడీపీ పార్టీ అధికారంలోకి వస్తుందని, అందరం కలసి చంద్రబాబునాయుడు సీఎంగా చసుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన నాయకులందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఒక్క బీసీతోనే సాధ్యమని, అందుకే వైసీపీ వీడి టీడీపీలో చేరామన్నారు. 2024లో సీఎంగా చందరబాబునాయుడును, బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీజనార్దన్‌రెడ్డిని గెలిపించడమే ధ్యేయమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ 6 పథకాలతోనే ఆంధ్రప్రదేశ్‌కు నిజమైన సంక్షేమం వస్తుందన్నారు.

కలసి కట్టుగా టీడీపీని గెలుపించుకుందాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, మార్చి 24: కలసి కట్టుగా ఉండి డోన్ నియోజకవర్గంలో టీడీపీని గెలుపించుకుందామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని వెంకటాంపల్లిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే రైతులకు పెట్టుబడి నిధిక్రింద ఏటా రూ.20వేలు, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద ప్రతి నెల రూ.3వేలు చెల్లిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం ఇంటింటా తిరిగి మెనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌యాదవ్, నాగరత్నమయ్య, ప్రభాకర్, నాగరాజు, వెంకటేశ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాతకు దీపాలంకరణ

బనగానపల్లె, మార్చి 24: నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని చౌడేశ్వరీమాత పల్లకీసేవ, సహస్ర దీపాలంకరణ, ఊయలసేవ కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు.

రాతిదూలం పోటీలు ప్రారంభం

చాగలమర్రి, మార్చి 24: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన రాతిదూలం పోటీలను ఏఎస్ఐ అబ్దుల్‌నబీ ఆదివారం ప్రారంభించారు. కడప, నం ద్యాల జిల్లాలకు చెందిన 18 జతల ఎద్దులు పోటీలు పాల్గొన్నాయి.

వైసీపీకి గుణపాఠం తప్పదు

● టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

దొర్నిపాడు, మార్చి 24: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఆదివారం టీడీపీ మ్యానిఫెస్టో గురించి వివరించి కరపత్రాలను అందజేశారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. వైసీపీ అన్యాయాలను, అక్రమాలను ఎదురిస్తే టీడీపీ నాయకులపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, వెంకట్రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, కట్టుబడి బాషా, భూమా సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రుద్రవరం, మార్చి 24: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం రుద్రవరంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ కొనసాగిస్తున్న రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. రుద్రవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఏరవ కృష్ణమూర్తి, లక్ష్మన్న, డ్రైవరు గురప్ప, రామయ్య, నరసయ్యతో పాటు మరో 50 కుటుంబాలు మాజీమంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. రుద్రవరంలోని తెలుగుపేటకు చెందిన జనసేన యూత్ భూమా అఖిలప్రియకు మద్దతు తెలిపింది. భార్గవరామనాయుడు, ఎల్‌వీ రంగనాయకులు, బాచుపల్లె నారాయణ, ఎర్రం ప్రతాప్‌రెడ్డి, రెక్కల మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత పరిపాలన అందిస్తాం

● కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



బైనపల్లి గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, మార్చి 24: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛాయుతమైన సుపరిపాలన అందిస్తామని డోన్ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బైనపల్లి, ఎంబాయి గ్రామ పంచాయితీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న సహజ వనరులన్నీ కొల్లగొట్టారనీ, అక్రమ మార్గంలో సంపాదించి దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. రాష్ట్ర సంపదను సృష్టించలేక ఉనన సహజ వనరులను కొల్లగొట్టి తన బినామి కంపెనీలకు మళ్లించారన్నారు. మరోసారి జగన్ రెడ్డికి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని దివాలా తీయించి మరో బీహార్ రాష్ట్రంగా మార్చడం ఖాయమని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, చంద్రశేఖర్ గౌడు, శశికుమార్ అప్ప, ప్రసాదప్ప, మాల శివయ్య, వెంకట్రాముడు, కృష్ణుడు, మధుసూదన్, ప్రసాద్, మద్దయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

డోన్, మార్చి 24: రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన రైతు పాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజావైద్యశాల మల్లికార్జున మాట్లాడుతూ రైతు పాల సుబ్బారావు భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడడం చాలా అన్యాయమన్నారు. రికార్డులను తారుమారు చేసి పేద రైతు భూమిని దౌర్జన్యంగా తీసుకోవడం సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల వేధింపులు తట్టుకోలేక రైతు పాల సుబ్బారావుతో పాటు ఆయన భార్య పద్మావతి, చిన్న కుమార్తె వినయలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సీఎం జగనే బాధ్యత వహించాలన్నారు. సీఎం సొంత జిల్లాలో బడుగులను బలి తీసుకోవడం చాలా దారుణమని, అందుకు కారణమైన వైసీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

‘వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం’



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ ఆరోపించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగాల ఊసే లేకుండా సీఎం జగన్ మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హుసేన్‌బాషా, వెస్లీ, సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

నంద్యాల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు కనులపండువగా నిర్వహించారు. ముందుగా దీక్షాహోమం, వాస్తుహోమం చేపట్టారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవార్లకు భక్తుల సమక్షంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎదుర్కోళ్లు తదితర కార్యక్రమాలను చేపట్టారు. భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు



పెద్దవంగలి దర్గా వద్ద ఫాతేహాలు నిర్వహిస్తున్న ప్రజలు

చాగలమర్రి, మార్చి 24: మండలంలోని పెద్దవంగలి దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల, కడప, కర్నూలు జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో దర్గా వద్ద ఫాతేహాలు ఇచ్చి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. దస్తగిరిస్వామి జెండాలను పురవీధుల గుండా ఊరేగింపు చేసి దర్గాలో కొలువుదీరింప చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్ఐలు రమణయ్య, సురేష్ పర్యవేక్షణలో ఏఎస్ఐ అబ్దుల్‌నబీ, పోలీసులు బందోబస్తు చేపట్టారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



రుద్రవరంలో పెద్దమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

రుద్రవరం, మార్చి 24: మండలంలోని రుద్రవరం, కొండమాయపల్లె, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో ఆదివారం పెద్దమ్మ సుంకులమ్మ, మారెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమిర్పంచి ప్రత్యేక పూజలు చేశారు.

●మండలంలోని నరసాపురం, రుద్రవరం నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల సందర్శనకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

మద్యం విక్రేత అరెస్ట్

సంజామల, మార్చి 24: అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కోవెలకుంట్ల మండలంలోని గుళ్ళదుర్తి గ్రామానికి చెందిన సత్తెన మద్దిలేటి సంజామల రైల్వేబ్రిడ్జి వద్ద మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందిలో దాడు లు నిర్వహించి నిందితుడు వద్ద 30 క్వార్టరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం



ఉయ్యాలవాడ మండలం రూపనగుడిలో ఈత మట్టలు పట్టుకొని ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ఉయ్యాలవాడ, మార్చి 24: మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవులు మట్టల ఆదివారపు ఆరాధనలు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత మట్టలు పట్టుకొని గ్రామ వీధుల్లో తిరుగుతూ పాటలు పాడుతూ తమ భక్తిని చాటుకున్నారు. ఈస్టర్ పండుగకు ఒక వారం ముందు ఈ ప్రత్యేక ఆరాధన చేస్తారని ఉయ్యాలవాడ ఫాస్టేట్ ఛైర్మన్ రెవరెండ్ జోషి తెలిపారు. నొస్సం గ్రామంలో విక్టర్ విజయ్‌కుమార్, మాయలూరులో ఫాస్టర్ ప్రేమ్‌కుమార్, అల్లూరు సెవెంత్ డే చర్చిలో ఫాస్టర్ సత్యరాజు ప్రసంగించారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. రుద్రవరం, పెద్దకంబలూరు, చందలూరు, మందలూరు, నరసాపురం ఇంకా పలు గ్రామాల్లో మట్టలు చేతబట్టుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల చుట్టూ మట్టలు చేతబట్టి ప్రదక్షిణలు చేసి అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్లు చర్చిలో ఏసు సందేశాన్ని వినిపించారు.

చాగలమర్రి: మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు మట్టల



రుద్రవరంలో ఈత మట్టలతో చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



చాగలమర్రిలో ఈత మట్టలతో ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు

ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉపవాస దినాల్లో భాగంగా ఆదివారం చివరి వారం కావడంతో క్రైస్తవులు మట్టలు చేతపట్టుకొని ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్సీఎం, సీఎస్ఐ, పెద్దబోదనం, ముత్యాలపాడు తదితర చర్చిల్లో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కొలిమిగుండ: చర్చిలలో మట్టల ఆదివారం ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. మండలంలోని కొలిమిగుండ్ల, అబ్దుల్లాపురం, బెలుం, అంకిరెడ్డి పల్లె, తుమ్మలపెంట, కల్వటాల, నందిపాడు గ్రామాలలోని సిఎస్ఐ చర్చిలలో పాస్టరమ్మ శ్రీదేవి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఓర్పు, సహనం, క్షమ గుణాలను అలవరచుకోవాలని మత పెద్దలు సూచించారు.